పడకేసిన పారిశుద్ధ్యం

- గ్రామాల్లో పేరుకుపోతున్న చెత్తాచెదారం
- డ్రైయినేజీల్లో నిండిన పూడిక
- పట్టించుకోని ప్రత్యేకాధికారులు



రోడ్డుపై పారుతున్న మురుగు (ఫైల్)



డ్రైయినేజీలో నిలిచిన మురుగు

బెజ్జూర్: గ్రామాల్లో చెత్తాచెదారం పేరుకుపోయి దర్శనమిస్తున్నాయి. పారిశుద్ధ్యం లోపిస్తున్నప్పటికీ సంబంధిత ప్రత్యేకాధికారులు పట్టించుకోవడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇళ్ల చుట్టూ ఖాళీ స్థలం ఉంటే నీరు నిల్వ లేకుండా చూసుకోవాలని, నీటి తొట్టిలపై మూతలు పెట్టాలని, ఎక్కువ రోజులు శుభ్రం చేయకుండా ఉంటే దోమలు వ్యాప్తి చెందే అవకాశం ఉంటుందని వైద్యాధికారులు సూచిస్తున్నారు.

రోడ్డు పక్కనే చెత్తాచెదారం..

బెజ్జూర్ మండలంలోని 22 గ్రామ పంచాయతీల్లో పారిశుద్ధ్యం పడకేసింది. దీంతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. చెత్తాచెదారంతో డ్రైయినేజీలు నిండిపోయాయి. వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కలిగి ఉండడంతో పాటు కొంత అప్రమత్తంగా ఉంటే సీజనల్ వ్యాధుల నుంచి రక్షణ పొందవచ్చని వైద్యులు సూచిస్తున్నారు. వానాకాలంలో ఎక్కువ వ్యాధులు ప్రబలే అవకాశం ఉంది.

అవగాహన కార్యక్రమాలు చేపట్టాలి..

గ్రామీణ ప్రాంతాల్లో వ్యక్తిగత మరుగుదొడ్ల వాడకం, పరిసరాల, వ్యక్తిగత శుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించాలి. మురికి కాల్వల్లో పేరుకుపోయిన చెత్తను తొలగించాలి. సీజనల్ వ్యాధుల బారిన పడకుండా వైద్య సిబ్బంది సూచనలు పాటించాలి. మురుగు నీటిని తొలగించిన తర్వాత బ్లీచింగ్ పౌడర్ చల్లాలి. దోమల నివారణకు మందులు పిచికారీ చేయించాలి. తాగునీరు కలుషితం కాకుండా రక్షిత మంచినీటి పథకాల నిర్వహణ తీరుపై అప్రమత్తంగా ఉండాలి. కొబ్బరి బోండాల వ్యాపారులు, హోటల్ నిర్వాహకులు మిగిలిన చెత్తను పరిసరాల్లో వేయకుండా తగలబెట్టేలా చర్యలు తీసుకోవాలి.

కానరాని ప్రత్యేకాధికారులు

సర్పంచుల పదవీ కాలం ముగిసి దాదాపు 18 నెలలు గడుస్తుంది. అప్పటి నుంచి గ్రామపంచాయతీ ప్రత్యేకాధికారుల పాలన కొనసాగుతుంది. ప్రత్యేకాధికారులు సమావేశాలకే తప్పా ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఏ ఒక్కరోజు తమ తమ గ్రామ పంచాయతీలలో పర్యటించిన దాఖలాలు లేవని ప్రజలు ఆరోపిస్తున్నారు.

పరిసరాల పరిశుభ్రతే ఆరోగ్యం



వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉంది. ప్రజలు సీజనల్ వ్యాధుల బారిన పడకుండా ఉండాలంటే పరిసరాల, వ్యక్తిగత శుభ్రత పాటించాలి. ఇంటి పరిసర ప్రాంతాల్లో వర్షపు నీరు నిల్వ లేకుండా చూసుకోవాలి. వేడి ఆహారం తీసుకోవాలి. దోమల బెడద లేకుండా చూసుకోవాలి.

– డాక్టర్ అవినాష్, బెజ్జూర్


పారిశుద్ధ్య పనులు చేపడుతున్నాం



గ్రామపంచాయతీల్లో పారిశుద్ధ్య పనులు చేపడుతున్నాం. రెండు రోజుల్లో గ్రామ పంచాయతీల్లో బ్లీచింగ్ పౌడర్ చల్లడం, దోమల నివారణ చర్యలు చేపడతాం. రోడ్ల వెంట డ్రైయినేజీ లేక నీరు నిల్వ ఉంటే తాత్కాలిక డ్రైయినేజీ ఏర్పాటు చేసి తొలగించేందుకు చర్యలు చేపడుతాం.

– బండారి ప్రవీణ్ కుమార్, ఎంపీడీవో, బెజ్జూర్

నిరీక్షణకు తెర..!



- నేడు కొత్త రేషన్‌కార్డుల పంపిణీ
- అర్హులు 805 మంది
- మంత్రి జూపల్లి కృష్ణారావు చేతుల మీదుగా అందజేత

కెరమెరి: గడిచిన పదేళ్లుగా రేషన్‌కార్డు కోసం నిరీక్షిస్తున్న లబ్ధిదారుల ఆశలు ఎట్టకేలకు నెరవేరనున్నాయి. మంగళవారం జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు చేతుల మీదుగా లబ్ధిదారులకు నూతన రేషన్ కార్డులు పంపిణీ చేయనున్నారు. దీంతో కొత్త రేషన్ కార్డుల కోసం ఎదురుచూస్తున్న వారు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ప్రజాపాలన కార్యక్రమంలో కొత్త కార్డుల కోసం కుటుంబ సభ్యుల పేర్లు చేర్పించడానికి, వివాహాలు జరిగిన అనంతరం కార్డుల విభజనకు అనేక మంది దరఖాస్తు చేసుకున్నారు. దరఖాస్తులను అధికారులు పరిశీలించి అర్హులను ఎంపిక చేశారు.

గుర్తింపునకు మొబైల్‌యాప్..

క్షేత్రస్థాయిలో లబ్ధిదారుల గుర్తింపునకు గ్రామ పంచాయతీ కార్యదర్శులకు మొబైల్ యాప్ అందజేశారు. రెండు నెలల క్రితం దరఖాస్తులను పరిశీలించిన కార్యదర్శులు వాటిని ఉన్నతాధికారులకు పంపించారు. దీంతో ఉన్నతాధికారులు దరఖాస్తులను పరిశీలించిన అనంతరం అర్హులైన వారికి నూతన రేషన్ కార్డుల పంపిణీకి రంగం సిద్ధం చేశారు. వచ్చిన దరఖాస్తులను క్రోడీకరించిన అధికారులు కొత్తగా రేషన్‌కార్డు పొందడానికి 805 మంది అర్హులుగా గుర్తించారు. దీంతో నేడు మధ్యాహ్నం 2 గంటలకు కెస్లాగూడలోని రైతువేదికలో మంత్రి జూపల్లి కృష్ణారావు చేతులమీదుగా నూతన రేషన్ కార్డులను పంపిణీ చేయనున్నారు. కాగా కార్డుల్లో కొత్త పేర్లు నమోదు చేయాలని 1,204 దరఖాస్తులు రాగా పేర్ల నమోదు పూర్తయ్యింది. ఇప్పటికే మండలంలోని 31 గ్రామ పంచాయతీల్లో అన్ని రకాల రేషన్‌కార్డులు కలిపి మొత్తంగా 8,929 రేషన్‌కార్డులు ఉన్నాయి. నూతనంగా పంపిణీ చేసే 805తో కలిపి మండలంలో కార్డుల సంఖ్య 9734కు చేరనుంది.

నేడు పంపిణీ

చాలా కాలంగా రేషన్‌కార్డులు లేక ఇబ్బంది పడుతున్న వారి కల నెరవేరింది. నేడు 805 మంది లబ్ధిదారులకు నూతన రేషన్ కార్డులు పంపిణీ చేస్తాం. లబ్ధిదారులు రేషన్‌కార్డులను సద్వినియోగం చేసుకోవాలి.

– భూమేశ్వర్, తహసీల్దార్

క్లుప్తంగా

వంజారీగూడలో వైద్య శిబిరం



వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ వనిత

లింగాపూర్: మండలంలోని వంజారీగూడలో లింగాపూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో వైద్యశిబిరం నిర్వహించారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా అవగాహన కల్పించినట్లు హెల్త్ సూపర్‌వైజర్ దత్తారాం, డాక్టర్ వనిత తెలిపారు. ల్యాబ్ టెక్నీషియన్ అశోక్ గ్రామస్తులకు రక్తపోటు, మధుమేహం, హిమోగ్లోబిన్, మలేరియా, డెంగీ వంటి పరీక్షలు నిర్వహించారు. అనంతరం మందులు పంపిణీ చేశారు.

మోడల్ డిగ్రీ కళాశాలకు రోడ్డు సౌకర్యం కల్పించాలి



డీఆర్‌వోకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ఆసిఫాబాద్‌అర్బన్: వాంకిడి మండలం బెండారాలోని ప్రభుత్వ మోడల్ డిగ్రీ కళాశాలకు రోడ్డు సౌకర్యాన్ని కల్పించాలని సోమవారం పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో డీఆర్‌వో రాజేశ్వర్‌రావుకు నాయకులు వినతిపత్రం అందజేశారు. పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి తిరుపతి మాట్లాడుతూ కళాశాల భవనాన్ని నిర్మించి ఐదేళ్లు గడిచినా నేటికీ రోడ్డు సౌకర్యం లేక వర్షాకాలంలో బురదలో నడుచుకుంటూ విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇదే విషయాన్ని పలుమార్లు ఉన్నతాధికారులకు విన్నవించినా పరిష్కారం కావడం లేదని పేర్కొన్నారు. నూతనంగా నిర్మించిన వసతిగృహాన్ని వెంటనే ప్రారంభించాలని డిమాండ్ చేశారు. నాయకులు జాడి వంశీ, మహేందర్ ఉన్నారు.

ఆర్‌వో ప్లాంట్ ప్రారంభం



ఆర్‌వో ప్లాంట్ ప్రారంభిస్తున్న నాబార్డ్ డీడీఎం వీరభద్రుడు

ఆసిఫాబాద్‌అర్బన్: ఆర్‌వో ప్లాంట్ ద్వారా ప్రజలకు స్వచ్ఛమైన నీటి సరఫరా చేయడంతో అనారోగ్య సమస్యలు దూరమవుతాయని నాబార్డ్ డీడీఎం వీరభద్రుడు అన్నారు. సోమవారం మండలంలోని సల్పలగూడ వాటర్ షెడ్‌లో ఆర్‌వో ప్లాంట్ ప్రారంభించారు. కార్యక్రమంలో వాసన్ ప్రోగ్రాం అధికారి సతీశ్‌కుమార్, వెంకటేశం, జయవర్ధన్, తిరుపతి, భీమ్‌దాస్, సతీశ్, గ్రామస్తులు పాల్గొన్నారు.

మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి



అవగాహన కల్పిస్తున్న ఎస్సై

బెజ్జూర్: మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని బెజ్జూర్ ఎస్సై సత్తార్ పాషా అన్నారు. సోమవారం మండలంలోని చిన్న సిద్దపూర్ గ్రామస్తుకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలం మహారాష్ట్రకు సరిహద్దున ఉండడంతో అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. తల్లిదండ్రులు తమ పిల్లల ప్రవర్తనపై శ్రద్ధ వహించాలన్నారు. ముఖ్యంగా యువత గంజాయి, మాదకద్రవ్యాలు, చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

రేపు రేషన్‌కార్డుల పంపిణీ

పెంచికల్‌పేట్: మండలంలోని ఎల్కపల్లి రైతు వేదికలో బుధవారం ఉదయం 10 గంటలకు నూతన రేషన్ కార్డులు పంపిణీ చేయనున్నట్లు పెంచికల్‌పేట్ తహసీల్దార్ పుష్పలత సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. లబ్ధిదారులు హాజరు కావాలని సూచించారు.

పిక్లాతండా మాజీ సర్పంచ్‌కు సన్మానం

లింగాపూర్: ఇటీవల రవీంద్రభారతిలో గవర్నర్ బండారు దత్తాత్రేయ, మంత్రి సీతక్క చేతుల మీదుగా రాష్ట్రంలోని ఆరు గ్రామ పంచాయతీల సర్పంచ్‌లకు పురస్కారాలు అందజేశారు. ఇందులో మండలంలోని పిక్లాతండా మాజీ సర్పంచ్ ఆడే మంగిబాయికిషన్‌కు ముచ్చర్ల సత్తన్న గ్రామ పంచాయతీ అవార్డు రాగా సోమవారం బీఆర్‌ఎస్ నాయకులు ఆయనను ఘనంగా సన్మానించారు. మాజీ జెడ్పీటీసీ లక్ష్యానాయక్, కిషన్, రాహుల్, అనిల్, గోవింద్, విజయ్, గంగాసింగ్ తదితరులు పాల్గొన్నారు.

'దివ్యాంగుల సమస్యలు అసెంబ్లీలో ప్రస్తావించాలి'



మాట్లాడుతున్న సత్యనారాయణ

రెబ్బెన: దివ్యాంగుల పెన్షన్ పెంపుతో పాటు ఇతర సమస్యలపై ప్రతిపక్ష పార్టీలు అసెంబ్లీలో ప్రస్తావించి వాటి పరిష్కారానికి కృషి చేయాలని వికలాంగుల హక్కుల పోరాట సమితి ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి పెద్దపెల్లి సత్యనారాయణ అన్నారు. సోమవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆగస్టు 4న ఆసిఫాబాద్‌లో నిర్వహించబోయే వికలాంగుల హక్కుల పోరాట సమితి సన్నాహక సభను విజయవంతం చేయాలని కోరారు. చేయూత పెన్షన్‌దారులకు కాంగ్రెస్ పార్టీ ఎన్నికల వేళ పెన్షన్‌ను పెంచుతామని హామీ ఇచ్చిందన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి 19 నెలలు గడుస్తున్నా ఇప్పటి వరకు ప్రభుత్వం పెన్షన్ పెంచలేదన్నారు. ప్రతిపక్షం సైతం వికలాంగులు, వృద్ధులు, వితంతువులు, చేయూత పెన్షన్‌దారుల పెన్షన్ పెంపుపై కనీసం అసెంబ్లీలో మాట్లాడకపోవడం సరికాదన్నారు. జిల్లా అధ్యక్షుడు బన్న మూర్తి, మంత్రి మల్లేష్, రాజేంద్రకుమార్, శంకర్, లింగంపెల్లి ప్రశాంత్, రవి, కయ్యూమ్, లింగంపెల్లి ప్రభాకర్, రేగుంట కేశవ్‌రావు, జలంపల్లి శ్రీనివాస్, సత్యనారాయణ, శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పౌష్టికాహారం అందించాలి



మాట్లాడుతున్న ఎంపీడీవో ప్రసాద్

కౌటాల: హాస్టల్‌లోని విద్యార్థులకు పౌష్టికాహారం అందించాలని ఎంపీడీవో కోట ప్రసాద్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని కేజీబీవీ హాస్టల్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వసతి గృహాల్లో మెనూ పకడ్బందీగా అమలు చేయాలని సూచించారు. హాస్టల్‌ను పరిశుభ్రంగా ఉంచాలని, సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలన్నారు. పదో తరగతి విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ ఉంచాన్నారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆయన వెంట ఎంపీవో మహేందర్‌రెడ్డి, ఎస్‌వో ప్రవిత, సిబ్బంది పాల్గొన్నారు.

'స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పాలి'



మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

రెబ్బెన: త్వరలో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ప్రజలు బుద్ధి చెప్పాలని బీజేపీ పార్లమెంట్ కోకన్వీనర్ కొలిపాక కిరణ్‌కుమార్, జిల్లా అధికార ప్రతినిధి ఆంజనేయులుగౌడ్‌లు అన్నారు. మండల కేంద్రంలోని గంగాపూర్ కమాన్ వద్ద ఎంపీ నిధులతో నూతనంగా నిర్మించిన హైమాస్ లైట్లకు స్విచ్ ఆన్ చేసి ప్రారంభించారు. వారు మాట్లాడుతూ ప్రధాన మంత్రి నరేంద్రమోడీ చేపడుతున్న అభివృద్ధి పథకాల ద్వారా, కేంద్రం అందిస్తున్న నిధులతో గ్రామాల్లో అభివృద్ధి జరుగుతోందన్నారు. జిల్లా కార్యదర్శి కుందారపు బాలకృష్ణ, నాయకులు గోలెం తిరుపతి, మండల అధ్యక్షుడు రాంబాబు, ప్రధాన కార్యదర్శి మల్లేష్, మధుకర్, వెంకట్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

బదిలీపై వెళ్తున్న అధికారికి సన్మానం



ఉమాకాంత్‌ను సన్మానిస్తున్న సెక్యూరిటీ సిబ్బంది

రెబ్బెన: సెక్యూరిటీ డీజీఎంగా విధులు నిర్వహిస్తూ బీపీఏ ఓసీపీ 2 ప్రాజెక్టు అధికారిగా బదిలీపై వెళ్తున్న ఉమాకాంత్‌ను సోమవారం జీఎం కార్యాలయంలోని ఎస్‌అండ్‌పీసీ కార్యాలయంలో సిబ్బంది సన్మానించారు. ఏరియా సెక్యూరిటీ అధికారిగా పని చేసి సిబ్బందిలో నూతన ఉత్తేజాన్ని నింపారని, సింగరేణి ఆస్తుల పరిరక్షణకు ఆయన చూపిన తెగువ అభినందనీయమని పేర్కొన్నారు. ఏరియా సెక్యూరిటీ అధికారిగా బదిలీపై ఏరియాకు వచ్చిన దాసరి శ్రీధర్‌ను స్వాగతిస్తూ సిబ్బంది శాలువాతో సన్మానించారు. జూనియర్ ఇన్స్‌పెక్టర్ రాజమౌళి, జమేదార్లు తిరుపతి, రాజయ్య, దశరథం, సెక్యూరిటీ సిబ్బంది రమేశ్, శ్రీనివాస్, అనిల్‌కుమార్, ప్రైవేటు సెక్యూరిటీ సూపర్‌వైజర్ కుమార్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సబ్‌స్టేషన్ మంజూరు

సాక్షి ఎఫెక్ట్

కెరమెరి: ఎన్నో ఏళ్లుగా విద్యుత్ సబ్‌స్టేషన్ ఒక్కటే ఉండడంతో తరుచూ విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడి వినియోగదారులు ఇబ్బందులు పడుతున్న దృష్ట్యా ఈ నెల 14న 'సాక్షి'లో 'కరెంట్ కట్‌తో తిప్పలు' శీర్షికన కథనం ప్రచురితమైంది. ఈ కథనానికి విద్యుత్ అధికారులు స్పందించారు. మండలంలోని ధనోరా గ్రామంలో నూతన 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ మంజూరైనట్లు ఎస్‌ఈ రాథోడ్ రమేశ్, ఏఈ రమేశ్ తెలిపారు. త్వరలోనే స్థలం సేకరణ చేసి పనులు ప్రారంభిస్తామన్నారు. చొరవ తీసుకుని సబ్‌స్టేషన్ మంజూరు చేసిన సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డికి ప్రజలు ధన్యావాదాలు తెలిపారు.

సీఐ పేరుతో నకిలీ ఫేస్‌బుక్ అకౌంట్

రెబ్బెన: రెబ్బెన సీఐగా విధులు నిర్వహిస్తున్న బుద్దె స్వామి పేరుతో ఫేస్‌బుక్ ఫేక్ అకౌంట్ క్రియేట్ చేసిన సైబర్ నేరగాళ్లు ఫ్రెండ్ రిక్వెస్ట్‌లు పంపుతూ మోసపూరిత మెసేజ్‌లు చేస్తున్నారు. విషయాన్ని గ్రహించిన సీఐ సోమవారం ప్రకటన విడుదల చేశారు. తన పేరుతో కొత్తగా ఎలాంటి ఫేస్‌బుక్ అకౌంట్ క్రియేట్ చేయలేదని, తన పేరుతో ఉన్న ఫేక్ అకౌంట్‌ను నమ్మి ఎలాంటి సమాచారం ఇవ్వొద్దని తెలిపారు.

ఐటీ రిటర్న్ గడువు పొడిగింపు

రెబ్బెన(ఆసిఫాబాద్): గత ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన ఐటీ రిటర్న్ దాఖలు గడువును సెప్టెంబర్ 15 వరకు పొడిగించినట్లు బెల్లంపల్లి ఏరియా జీఎం విజయ భాస్కర్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 31 వరకు ఉన్న ఐటీ రిటర్న్ దాఖలు గడువును ఆదాయపు పన్ను శాఖ ఇటీవలే పొడిగించిందన్నారు. ఉద్యోగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. సరైన ఆదాయ, వ్యయాల పత్రాలు సమర్పించి ఆన్‌లైన్‌లో పొందుపర్చాలని సూచించారు.

దరఖాస్తుల ఆహ్వానం

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లా కేంద్రంలోని ఆదర్శ పాఠశాల, కళాశాలలో గంటల ప్రాతిపదికన బోధించడానికి పీజీటీ ఎకనామిక్స్(ఆర్థిక శాస్త్రం) పోస్టు భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ దుర్గం మహేశ్వర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎంఏ ఎకనామిక్స్, బీఈడీ పూర్తిచేసిన అభ్యర్థులు ఈ నెల 30లోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. వివరాలకు 81065 12531 లో సంప్రదించాలని కోరారు.

ఎమ్మెల్యే పరామర్శ



నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే హరీశ్‌బాబు

కాగజ్‌నగర్ టౌన్: కాగజ్‌నగర్ పట్టణంలోని కాపువాడ కాలనీకి చెందిన మాజీ కౌన్సిలర్ దెబ్బటి తార అనారోగ్యంతో ఆదివారం మృతి చెందింది. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు సోమవారం దెబ్బటి తార భౌతికకాయానికి నివాళులర్పించారు. దెబ్బటి రూప, శ్రీనివాస్, మాజీ ఎంపీపీ మనోహర్ గౌడ్, నీరటి సత్యనారాయణ ఉన్నారు.

భక్తిశ్రద్ధలతో శ్రావణ పూజలు



అభిషేకం చేస్తున్న మహిళలు

కెరమెరి: శ్రావణ మాసాన్ని పురస్కరించుకుని సోమవారం మండల కేంద్రంలోని శివాలయంలో మహిళలు, భక్తులు శ్రావణ సోమవార పూజలు నిర్వహించారు. ఆలయంలో ఉన్న శివలింగానికి పాలు, పెరుగు, పంచదార, తేనె, నేతితో అభిషేకం చేశారు. భక్తులు మంగళహారతులిచ్చారు. ఆలయం వెలుపల ఉన్న శివుడు, గణపతి, అన్నపూర్ణమాత, నంది, ఆంజనేయ స్వామి, సాయి, రాధాకృష్ణ, నవగ్రహాలకు ప్రత్యేక పూజలు చేశారు. దీంతో భక్తులతో ఆలయం కిటకిటలాడింది. ఆలయ అర్చకుడు కలకర్ణి బాపూజి పూజలు నిర్వహించారు.

ఉపాధ్యాయుడిని నియమించాలని వినతి



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న తల్లిదండ్రులు

సిర్పూర్(టి): మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలికల ప్రాథమికోన్నత పాఠశాల (ఉర్దూ మీడియం)లో తెలుగు ఉపాధ్యాయుడిని నియమించాలని సోమవారం మండల పర్యటనలో ఉన్న కలెక్టర్‌కు ప్రభుత్వ బాలికల ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థుల తల్లిదండ్రులు వినతిపత్రం అందజేశారు. ఉర్దూ మీడియం పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయుడు లేక పోవడంతో విద్యార్థులకు తెలుగు రాయడం, చదవడం రావడం లేదన్నారు., అధికారులకు విన్నవించినా.. పట్టించుకోవడంలేదని కలెక్టరు దృష్టికి తీసుకెళ్లారు.

మహిళల రక్షణ కోసం నిరంతరం నిఘా



అవగాహన కల్పిస్తున్న షీటీం సభ్యులు

వాంకిడి: మహిళల రక్షణ కోసం నిత్యం బస్టాండ్, ప్రధాన చౌరస్తాలు, జన సమీకరణ ప్రాంతాల్లో, కాలేజీల వద్ద షీటీమ్స్ సభ్యుల నిరంతర నిఘా ఉంటుందని ఏఎస్సై పోషెట్టి, షీటీం సభ్యురాలు స్వప్న అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మహిళల భద్రత, ఆన్‌లైన్ మోసాలు, యాంటీ డ్రగ్స్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎవరైనా వేధింపులకు గురి చేస్తే భయపడకుండా 87126 70564 నంబర్‌కు కాల్ చేసి సమాచారం అందించాలని విద్యార్థులకు సూచించారు. ఆన్‌లైన్ గేమ్స్, లోన్‌యాప్‌ల జోలికి వెళ్లొద్దని, ఎవరైనా సైబర్ నేరాల బారిన పడితే వెంటనే హెల్ప్‌లైన్ నంబర్ 1930కి సమాచారం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో షీటీం సభ్యులు రజిని, దినేశ్, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

పెంచికల్‌పేట్: మండలంలోని చేడ్వాయి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం షీటీం ఆధ్వర్యంలో విద్యార్థులకు మహిళల భద్రతపైన అవగాహన కల్పించారు. షీటీం ఇన్‌చార్జి ఏఎస్సై సునీత మాట్లాడుతూ ప్రభుత్వం మహిళలు, విద్యార్థినుల కోసం అమలు చేస్తున్న చట్టాలను గురించి వివరించారు. సైబర్ క్రైం, సోషల్ మీడియా వినియోగంలో కలిగే అనర్థాలు, డయల్ 100పై అవగాహన కల్పించారు. ఎంఈవో రమేశ్‌బాబు, షీటీం సిబ్బంది రమాదేవి, స్వప్న, శ్రీనివాస్ పాల్గొన్నారు.

'ఇందిరమ్మ'లో ఇబ్బందులుంటే తెలపాలి



లబ్ధిదారులతో మాట్లాడుతున్న ఎంపీడీవో

కెరమెరి: ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో ఏవైనా ఇబ్బందులు ఉంటే నేరుగా తెలియజేయాలని ఎంపీడీవో అంజద్‌పాషా అన్నారు. సోమవారం మండలంలోని కొఠారి గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఇందిరమ్మ లబ్ధిదారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇళ్ల నిర్మాణం ఏ స్టేజీలో ఉందో అడిగి తెలుసుకున్నారు. ఇప్పటి వరకు ప్రారంభించని వారు మంగళవారం ప్రారంభించాలన్నారు. డబ్బులు మంజూరులో, నిర్మాణంలో, సామగ్రి తెప్పించడంలో ఏవైనా ఇబ్బందులు ఉంటే చెప్పాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి పిరిసింగుల సతీశ్ ఉన్నారు.

నిర్ణీత రుసుం వసూలు చేయాలి



జన్కాపూర్ రికార్డులు పరిశీలిస్తున్న ఈ డిస్ట్రిక్ట్ మేనేజర్ గౌతం రాజ్

ఆసిఫాబాద్: జిల్లాలోని మీసేవ కేంద్రాల్లో ప్రభుత్వం నిర్ణయించిన రుసుం మాత్రమే వసూలు చేయాలని ఈ– డిస్ట్రిక్ట్ మేనేజర్ గౌతం రాజ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని జన్కాపూర్‌లో గల మీసేవ కేంద్రాన్ని సోమవారం తనిఖీ చేశారు. సిటిజన్ చార్టర్, ధ్రువపత్రాల నమోదు, రిజిస్టర్ నిర్వహణ, ఫిర్యాదుల నంబర్ తదితర వివరాలు పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ మీసేవ కేంద్రాల్లో అధికంగా రుసుం వసూలు చేస్తే చర్యలు తప్పవని నిర్వాహకులను హెచ్చరించారు. దరఖాస్తు దారులు టోల్‌ఫ్రీ నంబర్ 1100 లేదా 79950 16036కు ఫిర్యాదు చేయాలని సూచించారు.